www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 197 | హైదరాబాద్ | శనివారం | 08-11-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## చర్చలు సఫలం



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

తెలంగాణలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్టు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ప్రైవేటు కాలేజీలకు ఫీజు బకాయిలు చెల్లింపునకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. యాజమాన్యాలు కోరిన రూ.1,500 కోట్ల బకాయిలలో రూ.600 కోట్లు ఇప్పటికే విడుదల చేయగా, మరో రూ.600 కోట్లు తక్షణమే విడుదల చేస్తామని, మిగిలిన రూ.300 కోట్లు కూడా త్వరలో క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలను ఈనెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కాలేజీల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు యథావిధిగా తెరుచుకోనున్నాయి. ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు, పలువురు ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి సినిమా హీరోలను జైల్లో పెట్టారు!

- ఓట్ల కోసం ఈరోజు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారని విమర్శ
- కాంగ్రెస్‌కు ఓటేస్తే మూడేళ్లు నరకయాతన అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరిక
- రెండేళ్ల రేవంత్ రెడ్డి పాలనలో నలుగురు సోదరులు మాత్రమే సంతోషంగా ఉన్నారని ఎద్దేవా



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

సినిమా హీరోలను జైల్లో పెట్టిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు సినిమా కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మూడేళ్ల పాటు నరకయాతన తప్పదని హెచ్చరించారు. వికాసానికి, విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు తమకు ఏది కావాలో తేల్చుకోవాలని కోరారు. రేవంత్ రెడ్డి పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పాలనలో నలుగురు సోదరులు మాత్రమే సంతోషంగా ఉన్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను రేవంత్ రెడ్డి విస్మరించారని ధ్వజమెత్తారు. ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే రేషన్ కార్డులు ఆగిపోతాయని, పెన్షన్ పెరగదని చెప్పడం సరికాదని హితవు పలికారు. కంటోన్మెంట్‌లో 6 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఏమయ్యాయో చెప్పాలని ఆయన నిలదీశారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని విమర్శించారు. రెండేళ్లుగా అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వని కాంగ్రెస్, జూబ్లీహిల్స్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడిచ్చిందని ఆరోపించారు. పీజేఆర్ మీద రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అంతగా అభిమానం ఉంటే 2023లో పీజేఆర్ కుమారుడికి టిక్కెట్ ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు.

## కేటీఆర్, కిషన్ రెడ్డి బ్యాడ్ బ్రదర్స్

- హైదరాబాద్ అభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ అడ్డు
- మూసీ ప్రక్షాళన నుంచి గోదావరి జలాల వరకు అడ్డుకుంటున్నారు



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

పదేపదే బంద్ అంటూ ప్రకటనలు చేస్తున్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలతో ఆటలాడితే కళాశాలలైనా, రాజకీయ పార్టీలైనా ఉపేక్షించేది లేదని నొక్కి చెప్పారు. విడుతల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామన్నారు. దీని కోసం విద్యార్థులను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాకనే కొత్తగా సమస్యలు వచ్చినట్టు అంతకుముందు ఈ సమస్య లేనట్టు యాజమాన్యాలు మాట్లాడడం సరికాదన్నారు. ఏ రాజకీయ పార్టీలతో అంటకాగుతున్నారో? ఏం చేస్తున్నారో అనేది తనకు తెలియదనుకుంటున్నారా? అని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అనుమతులు ఇవ్వలేని కారణంగా బంద్‌కు పిలుపు ఇవ్వడం సరికాదన్నారు. విద్య వ్యాపారం కాదని, సేవ మాత్రమే అని గుర్తు చేశారు. బ్లాక్ మెయిల్ చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేనప్పుడు ఒక్కో వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**కేటీఆర్, కిషన్ రెడ్డి బ్యాడ్ బ్రదర్స్**

హైదరాబాద్ అభివృద్ధికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు బీజేపీ లీడర్లూ అడ్డుకుంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. కేటీఆర్, కిషన్ రెడ్డిలను బ్యాడ్ బ్రదర్స్‌గా అభివర్ణించారు. గతంలో పీజేఆర్, శశిధర్ రెడ్డిలను గుడ్ బ్రదర్స్ అని పొలిటికల్ సర్కిళ్లలో పిలిచేవారని, ఆ ఇద్దరు నేతలు నగర అభివృద్ధికి కృషి చేయడం వలనే ఆ పేరు వచ్చిందన్నారు. కానీ ప్రస్తుతం హైదరాబాద్ అభివృద్ధికి కేటీఆర్, కిషన్ రెడ్డిలు పూర్తిగా అడ్డుకుంటున్నారని అందుకే బ్యాడ్ బ్రదర్స్‌గా పిలవాల్సి వస్తుందన్నారు. మూసీ ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ, ఫ్లై ఓవర్, ఎలివేటర్ కారిడార్లు, గోదావరి జలాలు రాకుండా కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. రోడ్ల విస్తరణ పనుల అనుమతుల్లోనూ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారని వివరించారు. అందుకే ఆ పార్టీలను జూబ్లీహిల్స్‌లో బొంద పెట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**కేంద్రం నుంచి జీరో సాయం**

వరదల్లో హైదరాబాద్ మునిగిపోతే కిషన్ రెడ్డి కేంద్రం నుంచి చిల్లిగవ్వ తీసుకురాలేదని సీఎం అన్నారు. సచివాలయంలో ఆలయం కూల్చేస్తే కిషన్ రెడ్డి స్పందించలేదని చెప్పారు. కాళేశ్వరం కట్టి లక్ష కోట్లు గోదావరిపాలు చేశారని విమర్శించారు. ప్రగతి భవన్ కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందన్నారు. కొడుకు కోసం వాస్తు సరిదిద్దడానికి ఉన్న సచివాలయాన్ని కూల్చి కొత్తది కట్టారని, దీని వలన ఎవరికి ఉపయోగం జరిగిందని ప్రశ్నించారు. సచివాలయం నిర్మిస్తే ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా? ఎవరికైనా పనికొచ్చిందా అని నిలదీశారు. పేద ప్రజలకు ఆ సచివాలయంతో ఏమైనా ప్రయోజనం జరిగిందా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కోసం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. సద్దాం హుస్సేన్‌లా ప్రాణభయంతో తనను తాను కాపాడేందుకు ప్రగతి భవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ బాత్రూమ్‌లు కట్టుకున్నారని, ఢిల్లీలోని అధికారిక నివాసానికి కూడా కేసీఆర్ బుల్లెట్ ఫ్రూట్ బాత్రూమ్‌లు నిర్మించుకున్నారని వెల్లడించారు. వాటిని తొలగించాలంటే మరింత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అంటూ సీఎం వ్యాఖ్యానించారు. రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పుతో తమకు రాష్ట్రాన్ని అప్పగించారని, గతంలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విద్యాసంస్థలే ప్రస్తుతం అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను రద్దు చేయడం తప్ప వీళ్లు ఒక్క అదనపు ఎయిర్ పోర్టునైనా తెచ్చారా అని నిలదీశారు. పదేళ్లలో మెట్రోను ఒక కిలోమీటరైనా విస్తరించలేదన్నారు. నగర విస్తరణతో పాటు మెట్రో విస్తరణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

## గ్రహణం వీడాలి.. కేసీఆర్ రావాలి

- రాష్ట్రానికి, హైదరాబాద్‌కు కాంగ్రెస్ పాలన గ్రహణంలా పట్టిందన్న కేటీఆర్
- తమ పదేళ్ల పాలనలో హైదరాబాద్ అభివృద్ధి అప్రతిహతంగా సాగిందని వెల్లడి
- రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నగరం కీర్తి మసకబారిందని విమర్శ

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి, ప్రత్యేకంగా హైదరాబాద్ నగరానికి పట్టిన గ్రహణం వీడాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఈరోజు తన ఎక్స్ ఖాతాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధి అప్రతిహతంగా కొనసాగిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ పదేళ్లలో ఐటీ, ఫార్మా సహా అన్ని రంగాలు వేగంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెల్లువెత్తాయని, శాంతిభద్రతల పరిరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు ప్రతీ అంశంలోనూ తమ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందని పేర్కొన్నారు. ఆ అభివృద్ధి ఫలాలు నగరంలోని ప్రతి పౌరుడికీ అందాయని, హైదరాబాద్ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టామని ఆయన కొనియాడారు. అయితే, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నగరం కీర్తి మసకబారిందని కేటీఆర్ విమర్శించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు.



"రాష్ట్రానికి, హైదరాబాదుకు పట్టిన ఈ గ్రహణం వీడాలి. మళ్లీ కేసీఆర్ రావాలి" అంటూ తన పోస్టులో పేర్కొన్నారు

## సొంత చెల్లిని, మాగంటి తల్లిని కేటీఆర్ మోసం చేశారు

- కేటీఆర్, హరీశ్‌పై మంత్రి సీతక్క ఫైర్
- ఓటమి భయంతోనే హరీశ రావు ప్రచారం చేస్తున్నారని విమర్శ
- వైన్, మైన్, ల్యాండ్ మాఫియాలతో బీఆర్ఎస్ విధ్వంసం సృష్టించిందని ఆరోపణ

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరిహడావిడి చూస్తుంటే బీఆర్ఎస్‌కు ఓటమి ఖాయమని అర్థమవుతోందని ఆమె ఎద్దేవా చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె, కేటీఆర్, హరీశ్ రావుల తీరుపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ తన సొంత చెల్లితో పాటు మాగంటి తల్లిని కూడా మోసం చేశారని సీతక్క ఆరోపించారు. "మాగంటి తల్లి ఆవేదన చూస్తే కేటీఆర్ ఎంత మోసకారో స్పష్టమవుతోంది. 91 ఏళ్ల వృద్ధురాలని కూడా చూడకుండా ఆమెను అవమానపరిచారు. ఈ ఆరోపణలపై కేసీఆర్ సమాధానం చెప్పాలి. కేటీఆర్ తీరును తెలంగాణ మహిళలందరూ గమనించాలి" అని ఆమె కోరారు. అనంతరం హరీశ్ రావుపై విమర్శలు గుప్పించారు. "నిశ్శబ్ద విప్లవం అని హరీశ్ రావు ప్రగల్భాలు పలుకుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే మాట అన్నారు. కానీ ఆ నిశ్శబ్ద విప్లవమే మిమ్మల్ని నిండా ముంచింది. నిన్నటి వరకు విషాదంలో ఉన్న ఆయన, ఇప్పుడు హడావుడిగా బయటకు వచ్చి ఎందుకు ప్రచారం చేస్తున్నారు? ఓటమి భయంతోనే 24 గంటలు గడవకముందే ప్రచారానికి వచ్చారు" అని సీతక్క విమర్శించారు. ఓటమి తప్పదని తెలిసి వాస్తవాలు దాచిపెట్టి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై కూడా సీతక్క తీవ్ర విమర్శలు చేశారు. "తెలంగాణలో వైన్, మైన్, ల్యాండ్, శాండ్ మాఫియాలతో మీరు విధ్వంసకర పాలన సాగించారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పదేళ్లలో కనీసం ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వని దుష్ట పాలన కేసీఆర్‌ది. మీరు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విడిపిస్తోంది" అని అన్నారు. తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం వంటి పథకాలతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా నగరాన్ని ముంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆమె ఆరోపించారు.



## బీఆర్ఎస్ అసలు రేసులోనే లేదు

- మా కార్యక్రమాలకు అనుమతులు ఎందుకివ్వరు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

మొన్నటి వరకు తమకు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ)తో పోటీ ఉండేదని, ఇప్పుడు తెలంగాణలో ఇండియన్ ముస్లిం కాంగ్రెస్(ఐఎంసీ)తో పోటీ ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అసలు పోటీలోనే లేదన్నారు. ఫీల్డ్ నుంచి ఔట్ అయ్యిందని చెప్పారు. ఐఎంసీ, బీజేపీ మధ్యే పోటీ ఉందన్నారు. అభివృద్ధి కావాలో, అరాచకాలు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఎంఐఎం గెలిచినట్టేనని, కాంగ్రెస్‌కు ప్రచారం చేసే నాయకులు లేరని, మొత్తం ఎంఐఎం నేతలే చేస్తున్నారన్నారు. ప్రచారంలో ఎక్కడ చూసినా పచ్చ జెండాలు కనిపిస్తున్నాయని, అవి ఎంఐఎంవా, పాకిస్తాన్‌వా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తమ క్యాంపెయింగ్‌ను తట్టుకోలేక సభలకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఫైరయ్యారు. ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ తన సభకు అనుమతి ఇవ్వలేదని, బాధ్యతాయుతంగా ఉండే ఈసీ, పోలీసులు.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పని చేస్తున్నాయని వ్యాఖ్యానించారు. తమ సభకు అనుమతి ఇచ్చి చివరకు రద్దు చేశారని, అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక మరో ప్రాంతంలో పెట్టుకోవాలని చెప్పారన్నారు. అదే బీఆర్ఎస్ డబ్బుల లెక్క కూడా రాయడం లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు డీజే, ఎల్ఈడీ స్క్రీన్లు పెట్టుకోవచ్చు కానీ తమకు మాత్రం అనుమతి ఇవ్వరా అంటూ మండిపడ్డారు. డబ్బులు ఇచ్చి దొంగ సర్వేలు చేస్తున్నారంటూ ఫైరయ్యారు. ఏపీకి చెందిన సర్వే సంస్థకు బీఆర్ఎస్ రూ.2 కోట్ల డబ్బులిచ్చి చేయించుకుందని ఆరోపించారు.

**రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర**

ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే బ్లాక్ మెయిల్ చేస్తారా అంటూ బండి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రతి నెలా రూ.500 కోట్ల చొప్పున బకాయిలు చెల్లిస్తానని హామీ ఇచ్చి, టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతే టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముందని ఫైరయ్యారు. కాలేజీ యాజమాన్యాలపై ఉన్న కోపంతో విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తి వేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు.

## పెట్టుబడులతో రండి

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ రోల్ మోడల్
- లాంగ్ టర్మ్ వాల్యూ క్రియేషన్, కో క్రియేషన్‌కు ప్రాధాన్యం
- అమెరికాలోని యూటా రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్ బాబు



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణలో అవకాశాలు పుష్కలమని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అమెరికాలోని యూటా పారిశ్రామికవేత్తలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ యూటా ఎండీ, సీవోవో డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని పారిశ్రామికవేత్తల బృందం శుక్రవారం సచివాలయంలో ఆయన్ను కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో యూటా, తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా గ్లోబల్ ఎకానమీకి మద్దతు ఇచ్చేలా, లాంగ్ టర్మ్ వాల్యూ క్రియేషన్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తీసుకొచ్చిన సంస్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఏయే రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం, పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలు, పారిశ్రామికవేత్తలకు ఇచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్‌లను వరల్డ్ ట్రేడ్ సెంటర్ యూటా, సిలికాన్ స్లోప్స్ అండ్ యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలని కోరారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో యూనివర్సిటీ ఆఫ్ యూటా, బీవైయూ, న్యూమాంట్ యూనివర్సిటీలతో కలిసి రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలు ఉమ్మడి అకడమిక్, రీసెర్చ్ కార్యక్రమాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యూటా రాష్ట్రంతో పటిష్టమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. ఈ ద్వైపాక్షిక సహకారం పెట్టుబడులకే పరిమితం కాకుండా ఇన్నోవేషన్, స్కిల్స్, టెక్నాలజీ రంగాల్లో ఉమ్మడి ఆవిష్కరణలకు దిక్సూచిగా మారాలని ఆకాంక్షించారు. తెలంగాణ లాంటి ఫాస్ట్ గ్రోయింగ్, డైనమిక్, ప్రో యాక్టివ్ రాష్ట్రంతో కలిసి పని చేసేందుకు యూటా సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ అన్నారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పని చేస్తామని తెలిపారు.

## కొమురవెల్లి లో ఘనంగా
# జాతీయ గేయాలాపన

- **కొమురవెల్లి ఎంపీడీవో బండి లక్ష్మప్ప**

**కొమురవెల్లి, నవంబర్ 7 (సిద్ధిపేట పవర్)**

స్వాతంత్ర్య సమరంలో జాతిని జాగృతం చేసిన వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వేడుక సందర్భంగా ఈరోజు ఉదయం 10.00 గంటలకు కొమురవెల్లి MPDO కార్యాలయంలో జాతీయ ఉద్యమ మహనీయులకు నూతన ఎంపీడీవో బండి లక్ష్మప్ప నివాళులర్పించి సిబ్బంది మరియు నాయకులతో కలిసి జాతీయ గేయాలాపన చేయడం జరిగింది.. అనంతరం ఎంపీడీవో బండి లక్ష్మప్ప మాట్లాడుతూ దేశం నాకేమిచ్చిందని దూషించుట దోషం... దేశానికి ఏమిస్తే తీరును రుణ శేషం. దేశభక్తి కలిగిన ప్రతీ పౌరుడు ఆలోచించే విధానం ఇదే అని, అలాంటి ఆలోచన సరళిని భారతీయుల్లో పెంపొందిపజేసిన మంత్రాల్లో ముఖ్యమైంది వందేమాతరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస వర్మ, కొమురవెల్లి పంచాయతీ సెక్రెటరీ హరి ప్రసాద్ , కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు బొచ్చు ఎల్లయ్య, చింతల రమేష్ పాల్గొన్నారు.



# CMRF చెక్కు అందచేత

**కొమురవెల్లి, నవంబర్ 7 (సిద్ధిపేట పవర్)**

కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామంలో పెద్ది సంతోష్ రెడ్డి S/O మల్లా రెడ్డి కి ప్రమాదవశాత్తు కాలు విరగడంతో, వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చుకాగా, ఇట్టి విషయం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ దృష్టికి రాగా, వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ నిధి నుండి 60,000 రూపాయలను మంజూరు చేయించడం జరిగింది. ఇట్టి మంజూరైన చెక్కును బాధితుని ఇంటికి వెళ్ళి పరామర్శించి, వారి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు మాట్లాడుతూ CMRF చెక్కును మంజూరు చేయించిన నాగపురి కిరణ్ కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలిపారు..










# సెయింట్ విన్సెంట్ పాఠశాలలో వందేమాతరం గీతం ఆలాపన

- **ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జానెట్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

నేటితో వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జగదేవపూర్ మండలం అలిరాజాపేట సెయింట్ విన్సెంట్ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ జానెట్ ఆధ్వర్యంలో సామూహిక గీతాలాపన విద్యార్థులతో చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరులను స్మరించుకుంటూ చిన్నప్పటినుండి విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకొని దేశ సేవలో వారందరు భాగస్తులు కావాలని ఆకాంక్షిస్తూ స్వాతంత్య సమరంలో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో బకిం చంద్ర ఛటర్జీ రాసిన గేయం ముఖ్య భూమిక పోషించి బ్రిటీషువారి వెన్నులో వణుకు పుట్టించడమైందని పాఠశాల తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ అలీన, సిస్టర్ స్టెఫీ, ఉపాధ్యాయులు కరుణాకర్, రమేష్,పి.ఈ.టీ. శ్రీకాంత్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# బీసీ రిజర్వేషన్ల సాధనకై వినతి పత్రాల సమర్పణ

- **MRO, MPDO లకు వినతి పత్రాలు అందించిన బీ సీ నాయకులు**

**సిద్దిపేట, నవంబర్ 7 (సిద్దిపేట పవర్)**

42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆద్వర్యంలో MRO, MPDO లకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, అదేవిధంగా 9వ షెడ్యూల్ చేర్చాలని కోరుతూ BC SC ST JAC మండల కో కన్వీనర్ శ్యాగ బాబు మహారాజ్, బంజేరుపల్లి యువ నాయకులు ఆకుల నవీన్ పటేల్ ఆద్వర్యంలో మండల MRO కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిల్ నెం.3, 4 ద్వారా మార్చ్ 2025లో విద్య, ఉద్యోగాలు మరియు స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ను 42 శాతానికి పెంచుతూ ఆమోదించింది. ఈ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపబడి గత 7 నెలలుగా కేంద్రం వద్ద తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడానికి పెండింగ్లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రం పై ఒత్తిడి పెంచి 9వ షెడ్యూల్ అమలు చేయించే బాధ్యతను తన పై వేసుకొని ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు..




## వందేమాతరం 150 ఏళ్ల
# జాతీయ ఉత్సవాల్లో పీఐబీ

**సికింద్రాబాద్, నవంబర్ 07 ( సిద్దిపేట పవర్ ):**

దేశభక్తి, ఐక్యత ప్రతీకగా నిలిచిన జాతీయ గేయం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాన్ని పీఐబీ హైదరాబాద్ ఘనంగా నిర్వహించింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), డీపీడీ యూనిట్లతో కలిసి పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో ఈ వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది సమిష్టిగా 'వందేమాతరాన్ని' ఆలపించారు. మాతృభూమి పట్ల గౌరవం, ఐక్యతను చాటే ఈ గేయానికి ప్రతీకగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీబీసీ హైదరాబాద్ సిబ్బంది దేశభక్తిని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ (ఐఐఎస్) మాట్లాడుతూ "వందేమాతరం గేయం మన జాతీయ చైతన్యానికి పునాది. ఈ గేయానికి ఉన్న అసలైన స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలన్న ఉద్దేశ్యంతో దేశవ్యాప్తంగా ఉత్సవాలను నిర్వహించేందుకు 2025 అక్టోబర్ 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది" అని తెలిపారు. బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించిన ఈ గేయం మొదటగా 1875 నవంబర్ 7న 'బంగాదర్శన్' పత్రికలో ప్రచురితమైందని, ఆనందమఠ్ నవలలో భాగమని ఆమె పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ఏడాది పొడవునా జరిగే వేడుకలకు శ్రీకారం చుట్టగా, పీఐబీ హైదరాబాద్, సీబీసీ, డీపీడీ, సీబీఎఫ్సీ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు.




# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం



- **టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా శుక్రవారం యూసుఫ్ గూడ లోని ఎస్ బి హెచ్ సబ్ యస్ బీ హెచ్ కాలని, శ్రీకృష్ణదేవరాయ నగర్, పల్లవి అపార్ట్మెంట్ , వాల్మీకి దేవాలయం వివిధ బూత్ నెంబర్ 288 లో తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి భండారు శ్రీకాంత్ రావు, కప్పర భాను ప్రకాశ్ రావు గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించి పేదల సంక్షేమం కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా కప్పర భాను ప్రకాష్ రావు మాట్లాడుతూ బి అర్ ఎస్ మాయమాటలు జూబ్లిహిల్స్ ప్రజలు నమ్మే పరిస్తితి లేక కాంగ్రెస్ పై విషప్రచారాలు చేస్తున బి అర్ ఎస్ ను తమ నియోజగవర్గం నుండి తరిమి వేసేందుకు జూబ్లిహిల్స్ ప్రజలు ఎన్నికల డేట్ కోసం ఎదురుచూస్తున్నారు అని వారు తెలిపారు. అనంతరం మంత్రి శ్రీదర్ బాబు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ప్రచారం లో పాల్గొన్న గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి

**గజ్వేల్, నవంబర్ 07 (సిద్దిపేట పవర్ ):**

జూబ్లీహిల్స్ ప్రచారం లో భాగంగా నవీన్ యాదవ్ గెలవాలని ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు గెలిపిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ లో గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశిరెడ్డి రవీందర్ రెడ్డి మాజీ సర్పంచ్ కొంపల్లి కర్ణాకర్ రామ్ రెడ్డి డప్పు గణేష్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- **బీఆర్ఎస్ ముగిసిన ఒక అధ్యాయం**
- **జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ కవిత**
- **నస్రీన్ బేగంతో కలసి జూబ్లీహిల్స్ లో ఎన్నికల ప్రచారం**



**సికింద్రాబాద్, నవంబర్ 07 ( సిద్దిపేట పవర్ ):**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తాయని జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ పి.కవిత అన్నారు. మహిళా కాంగ్రెస్ ఏ- బ్లాక్ ప్రెసిడెంట్ నస్రీన్ బేగం, తదితర నాయకులు,కార్యకర్తలతో కలసి ఆమె శుక్రవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని జవహార్ నగర్ లో ఇంటింటికి పాదయాత్రగా తిరుగుతూ సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను గురించి వివరించారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పై అబద్దపు ఆరోపణలతో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనేది చరిత్రలో ముగిసిన అధ్యాయమని విమర్శించారు. స్వంత చెల్లెలు కవిత కే అన్యాయం చేసిన కేటీఆర్ ఇక సామాన్య జనాలకు,మహిళలకు ఏం న్యాయం చేస్తారని, ఏం పట్టించుకుంటారని అన్నారు. తప్పుడు సర్వేలతో ప్రజల దృష్టి మరల్చడానికి బీఆర్ఎస్ నేతలు చేస్తున్న చౌకబారు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని , ఈ ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## తెలంగాణ సర్కారీ స్కూళ్లకు గుడ్ న్యూస్..

# ఇకపై ఫ్రీ ఇంటర్నెట్ సేవలు

## జిల్లా వైద్య ఆరో డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు రేవంత్ సర్కార్ నిర్ణయం

- **రాష్ట్రవ్యాప్తంగా 22 వేలకు పైగా స్కూళ్లకు ప్రయోజనం**
- **బీఎస్ఎన్ఎల్, టీ-ఫైబర్‌తో విద్యాశాఖ ఒప్పందం**
- **రెండు దశల్లో ఇంటర్నెట్ కనెక్షన్ల ఏర్పాటుకు ప్రణాళిక**
- **సమగ్ర శిక్ష నిధుల ద్వారా ప్రాజెక్టు అమలు**

**సిద్దిపేట పవర్:**

డిజిటల్ విద్యా విధానాన్ని బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వరంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, టీఫైబర్‌తో పాఠశాల విద్యాశాఖ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నిర్ణయంతో సర్కారీ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య మరింత అందుబాటులోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 26,887 ప్రభుత్వ విద్యా సంస్థలు ఉండగా, వాటిలో కంప్యూటర్లు అందుబాటులో ఉన్న 22,730 పాఠశాలలకు ఇంటర్నెట్ కనెక్షన్లు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. మొదటి విడతలో భాగంగా 10,342 పాఠశాలలకు కనెక్షన్లు ఇస్తారు. ఇందులో 5,342 స్కూళ్లకు బీఎస్ఎన్ఎల్, మిగిలిన 5,000 స్కూళ్లకు టీఫైబర్ ఉచితంగా ఇంటర్నెట్ సేవలను అందిస్తాయి. బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే వెయ్యి పాఠశాలల్లో కనెక్షన్ల ఏర్పాటును పూర్తి చేసింది.
రెండో విడతలో మిగిలిన 12,388 పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తారు. ఇందులో 9,404 పాఠశాలలకు బీఎస్ఎన్ఎల్, 2,984 పాఠశాలలకు టీఫైబర్ కనెక్షన్లు ఇస్తాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ప్రభుత్వం ఆయా సంస్థలకు చెల్లించనుంది. వాస్తవానికి, రాష్ట్రంలో 2025 26 విద్యా సంవత్సరం నుంచే పలు ఫౌండేషన్ల సహకారంతో డిజిటల్ తరగతులు ప్రారంభమైనప్పటికీ, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో అవి పూర్తిస్థాయిలో విద్యార్థులకు చేరలేదు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఒకవేళ కనెక్షన్ల ఏర్పాటులో జాప్యం జరిగితే, ప్రత్యామ్నాయంగా ప్రైవేటు కనెక్షన్లు తీసుకునేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వెసులుబాటు కల్పించారు. ఇందుకు అయ్యే ఖర్చును స్కూల్ గ్రాంట్ల నుంచి వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ టీచర్ల నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, ఇప్పుడు ఇంటర్నెట్ సౌకర్యం కూడా తోడవడంతో డిజిటల్ విద్యకు కొత్త ఊపు వస్తుందని అధికారులు భావిస్తున్నారు.





## సెయింట్ ఫ్రాన్సిస్ గర్ల్స్ హైస్కూల్ లో

# వందేమాతరం ఉత్సవాలు

**సికింద్రాబాద్, సిద్దిపేట పవర్:**

సికింద్రాబాద్ సెయింట్ ఫ్రాన్సిస్ గర్ల్స్ హైస్కూల్ లో శుక్రవారం 150 వసంతాల వందేమాతరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భాన్ని పురస్కరించుకొని స్కూల్ కు ముఖ్య అతిథిగా హాజరైన ఎన్సీసీ కమాండ్ ఆఫీసర్ కల్నల్ ఎంఎస్.కుమార్ ను స్కూల్ హెడ్మాస్టర్ సిస్టర్ గ్రేసీ, ఎన్సీసీ కోఆర్డినేటర్ ఏ.క్రిస్టినా నిర్మల, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా అంతా కలసి వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపించారు. విద్యార్థులను ఉద్దేశించి కల్నల్ ఎంఎస్ కుమార్ మాట్లాడుతూ..150 వ వందేమాతరం దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరు తమలో దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. భవిష్యత్ లో సైనిక బృందాలు, జాతీయ డిఫెన్స్ అకాడమీలో చేరి, దేశ సేవ చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఎన్సీసీ కి సంబందించిన రెగ్యులర్ తనిఖీలు నిర్వహించారు.కార్యక్రమంలో స్కూల్ బోధన సిబ్బంది, ఎన్సీసీ విద్యార్థులు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు

# 44%ఫిట్‌మెంట్ అమలు చేయాలి

- **యూనియన్ నేతల డిమాండ్**
- **గాంధీ మెడికల్ కాలేజీలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం**

**సికింద్రాబాద్, సిద్దిపేట పవర్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 44 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణలు తక్షణం అమలు చేయాలని ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.మూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాలలో హేమలత అధ్యక్షతన జరిగిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ— ప్రభుత్వ ఉద్యోగులకు 2023 జూలై నుంచి అమల్లోకి రావాల్సిన పీఆర్సీని ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఐదు విడతల డీఏలను కూడా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వి. వేణు కుమార్ మాట్లాడుతూ — వైద్యశాఖలో గత 60 ఏళ్లుగా గుర్తింపు పొందిన తమ యూనియన్ ఉద్యోగుల సంక్షేమానికి అనేక విజయాలు సాధించిందని తెలిపారు. ఇటీవల కొందరు అధికారులు యూనియన్ నాయకులను మినహాయించకుండా బదిలీలు చేసిన నేపథ్యంలో రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకొని వాటిని రద్దు చేసి రక్షణ కల్పించిందని వివరించారు. ఉస్మానియా వైద్యశాల నర్సింగ్ ఆఫీసర్ కె. సుశీల మాట్లాడుతూ — రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జీఓ 317 ద్వారా న్యాయం పొందని ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. మహిళా నర్సింగ్ ఆర్డర్లీలకు ఇస్తున్న అదనపు ఇంటి అద్దె అలవెన్స్‌ను పురుషులకు కూడా వర్తింపజేయాలని, టివివిపిలో అసిస్టెంట్ కమిషనర్ (నర్సింగ్) పదవిని తక్షణం భర్తీ చేయాలని అభ్యర్థించారు. నగర కార్యదర్శి జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ — ఉద్యోగులకు ల్యాబ్‌లలో ఇన్ సర్వీస్ శిక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించిన నర్సింగ్ డైరెక్టరేట్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాజు, ఫరూక్, భూమయ్య, లక్ష్మీపతి, రాఘవేంద్ర, సాజిద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# అసలైన ఓట్ చోరీ కాంగ్రెస్ పార్టీయే...

- **మోదీ ఓట్ చోరీ కాదు..140 కోట్ల దిల్ చోరీ..**
- **బీజేపీ రాష్ట్ర నాయకురాలు రాజేశ్వరి...**

**సికింద్రాబాద్, సిద్దిపేట పవర్:**

భారత జాతీయ ఎన్నికల కమిషనర్ గారిని ఉద్దేశించి మీరు ప్రశాంతంగా ఉద్యోగ విరమణ చేయలేరని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా చేసిన వ్యాఖ్యలు భారతదేశంలో బయోత్పాతాన్ని సృష్టించే విధంగా ఉన్నాయని బిజెపి ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరం రాజేశ్వరి అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓట్ చోరీ కాదని 140 కోట్ల ప్రజల హృదయాన్ని చూరగున్నారని ఎన్నికలు రాగానే కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యం రాజ్యాంగం గుర్తుకొస్తాయని బిజెపి రాష్ట్ర నాయకులు మల్లేశ్వరపు రాజేశ్వరి విమర్శించారు.రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకొని ప్రజాస్వామ్యం,రాజ్యాంగం ప్రమాదంలో పడిందని మైనారిటీలు ప్రమాదంలో ఉన్నారని రిజర్వేషన్లు ప్రమాదంలో ఉన్నాయని హిందీ భాషను రాష్ట్రాలపై బలవంతంగా రుద్దడం వలన ప్రాంతీయ భాషలు ప్రమాదంలో పడ్డాయని దుష్ప్రచారం చేసి ఇప్పుడు కొత్తగా మీ ఓటు ప్రమాదంలో పడిందని ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వం కలిసి మీ ఓటును దొంగిలిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తుందని కానీ ఇవన్నీ ఏవీ ప్రమాదంలో పడలేదని ప్రమాదంలో పడింది 65సంవత్సరాలు దేశాన్ని పాలించిన నెహ్రూ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రమాదంలో పడబోతుందని తెలుసుకొని దేశప్రజల దృష్టిని మరల్చడానికి ఓటు చోరీ అంటూ రోడ్లపై తిరుగుతిన్నారని పేర్కొన్నారు. స్వాతంత్రానంతరం నెహ్రూ కాలం నుండి అసలైన ఓటు చోరీ కి పాల్పడింది నెహ్రూ కుటుంబ సభ్యులేనని విమర్శించారు.1947 సంవత్సరంలో మొదటి సారిగా ప్రధానమంత్రి ఎన్నికకు రాజ్యాంగ పరిషత్ లోని 15 ఓట్లకుగాను 12ఓట్లు సాధించిన సర్దార్ పటేల్ ప్రధాన మంత్రి కాకుండా ఒక్క ఓటు వచ్చిన నెహ్రూ ప్రధాన మంత్రి అయి ఓటు చోరీకి పాల్పడ్డారని అన్నారు. తర్వాత అడ్డదారిలో గెలిచిన ఇందిరాగాంధీ నియామకం చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇస్తే తీర్పును కాలరాసి అత్యవసర పరిస్థితి ప్రకటించి ఓటు చోరీకి పాల్పడ్డారని అన్నారు.1968లో సోనియా వివాహం జరిగితే 16 సంవత్సరాల వరకు భారత పౌరసత్వం తీసుకోలేదని కాని 1983లో జరిగిన ఎన్నికల్లో సోనియా ఓటు వేసి ఓటు చోరికి పాల్పడిందని పీవీ నరసింహ రావు ప్రధాన మంత్రి అయ్యాక జరిగిన బల ప్రదర్శనలో పార్లమెంటు సాక్షిగా ఎంపీలను కొనుగోలు చేసి డబ్బుల సూటుకేసులు మార్చుకొని ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసి ఓటు చోరికి పాల్పడింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు.2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 100నియోజకవర్గాల్లో ఓటు చోరీ జరిగింది అని చేస్తున్న ప్రచారం అది నిజమే అయితే కాంగ్రెస్ పార్టీ గెలిచిన 99 పార్లమెంటు నియోజకవర్గాలతోపాటు హైద్రాబాద్ నుండి గెలిచిన అసదుద్దీన్ నియోజవర్గాల్లో మరియు కర్ణాటకలోని నంజెగౌడ ఎన్నిక చెల్లనేరదు కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును ఒప్పుకొని కాంగ్రెస్ పార్టీ ఓటు చోరీకి పాల్పడినట్లు రాహుల్ గాంధీ ఒప్పుకోవాలని అన్నారు. బిజెపి ఓటు చోరికి పాల్పడేది అయితే వాజపేయి గారు ఒక్క ఓటు తేడాతో ప్రధాన మంత్రి పీఠాన్ని వదులుకునే వారు కాదనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తెరగాలి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు భారతదేశాన్ని ధర్మ సత్రంగా మార్చి పాకిస్థాన్,ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ ల నుండి వచ్చిన రోహింగ్యాలకు అక్రమ చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించి ఓటు బ్యాంకుగా మార్చుకుందని ఆరోపించారు.ఆపరేషన్ సింధూర్ ను పాక్ విదేశాంగ మంత్రి ఒప్పుకున్న రాహుల్ ఒప్పుకోలేదని ఇప్పుడు నేపాల్ లో జరిగిన సంఘటన భారత్ లో జరిగే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించడం శత్రుదేశాలకు మద్దతు తెలిపే విధంగా ఉన్నాయని అన్నారు.కాంగ్రెస్ పార్టీకి నాయకులకు గ్యారంటీ వారంటీ అయిపోయిందని అందుకే మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.



# వరంగల్ నిట్ విద్యార్థికి రూ.1.27 కోట్ల ప్యాకేజీ

**వరంగల్, సిద్దిపేట పవర్ :**

వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) సరికొత్త రికార్డును నమోదు చేసుకుంది. గతంలో రూ.88 లక్షల ప్యాకేజీని అధికమించి అత్యధికమైన రూ.1.27 కోట్లు దేశీయ ప్యాకేజీ ఆఫర్ లభించింది. ప్లేస్‌మెంట్ సీజన్ 202526 ప్రారంభ దశలోనే వచ్చిన అద్భుత ఫలితాలు సంస్థ బలమైన విద్యా పునాది, పరిశ్రమలతో ఉన్న సన్నిహిత బంధాలు, విద్యార్థుల అసాధారణ ప్రతిభను ప్రతిబింబిస్తున్నాయి. నిట్ చరిత్రలో అత్యధిక దేశీయ ఆఫర్ రూ.1.27 కోట్ల జాబ్ ఆఫర్ ఉత్తరప్రదేశ్ నోయిడాకి చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బీటెక్ విద్యార్థి నారాయణ త్యాగి బహుళజాతి కంపెనీ నుంచి రూ.1.27 కోట్ల సీటీసీతో దేశీయ ఆఫర్‌ను పొందారు. ఇది వరంగల్ నిట్ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ప్యాకేజీ. అలాగే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి మొహమ్మద్ నహిల్ నష్వాన్ రూ.1 కోటి సీటీసీతో దేశీయ ఆఫర్‌ను పొందారు. ఈ ఘనతలు వరంగల్ నిట్‌ను దేశంలోని అగ్రశ్రేణి ఇంజనీరింగ్ విద్యాసంస్థలలో ఒకటిగా నిలబెట్టారని, అంతర్జాతీయ ప్రమాణాల విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు మరోసారి నిరూపించాయని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. 202526 ప్లేస్మెంట్ డ్రైవ్ ప్రారంభ రెండు నెలల వ్యవధిలోనే విభిన్న శాఖల విద్యార్థులు అత్యుత్తమ అవకాశాలను సాధించారని చెప్పారు. ఇప్పటివరకు ప్లేస్‌మెంట్ సీజన్ తొలి రెండు నెలల్లో రూ.70 లక్షలకు పైగా సీటీసీతో 6 మంది విద్యార్థులు ఆఫర్లు పొందారని, రూ.50 లక్షలకుపైగా సీటీసీతో 34 మంది, రూ.30 లక్షలకుపైగా సీటీసీతో 125 మంది, రూ.25 లక్షలకుపైగా సీటీసీతో 163 మంది, రూ.20 లక్షలకుపైగా సీటీసీతో 200 మందికి పైగా విద్యార్థులు ఆఫర్లు పొందారని తెలిపారు. అక్టోబర్ 15 వరకు సగటు ప్యాకేజీ రూ.26 లక్షలను దాటిందని చెప్పారు. ప్లేస్ మెంట్ సీజన్ ఇంకా కొనసాగుతూనే ఉందని, ఇంకా చాలామంది ప్రతిభావంతులైన విద్యార్థులు అవకాశాల కోసం అందుబాటులో ఉన్నారన్నారు. అనేక ప్రముఖ సంస్థలు క్యాంపస్ సందర్శనకు సిద్ధంగా ఉన్నాయని, రాబోయే నెలల్లో మరిన్ని అధిక విలువ గల ఆఫర్లు వచ్చే అవకాశముందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. అత్యధిక ప్యాకేజీలు పొందిన విద్యార్థులందరికీ, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ప్లేస్మెంట్ సీజన్ విద్యార్థుల ప్రతిభ, పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలు, సంస్థపై రిక్రూటర్ల నమ్మకాన్ని స్పష్టంగా చూపిస్తోందన్నారు. ఈ విజయాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించిన సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీసీపీడీ) బృందానికి, హెడ్ ప్రొఫెసర్ పి.వి. సురేష్‌కు నిట్ డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

మాది ఉత్తరప్రదేశ్ నోయిడా.. అమ్మ కెమిస్ట్రీ టీచర్, నాన్న ఇంజనీర్. నేను ఇంజనీర్ల కుటుంబం నుంచి వచ్చాను. అమ్మ బోధనపై ఉన్న ఆసక్తితో నన్ను సైన్స్ వైపు ఆకర్షించగా నాన్న క్రమశిక్షణ, పట్టుదల విలువలను నాకు నేర్పించారు. వారి సంయుక్త ప్రభావం వలనే నా చిన్ననాటి నుంచే గేమింగ్, సాంకేతికతపై ఉన్న ఆసక్తి కంప్యూటర్ సైన్స్ వైపు నన్ను నడిపించింది.
నేను ఎల్లప్పుడూ నన్ను సవాలు చేసుకుంటూ, విభిన్న అనుభవాలను సంపాదించి, నేను చేసే ప్రతి ప్రయత్నానికి అర్థవంతమైన దోహదం చేయాలని కోరుకుంటున్నాను. నా కుటుంబానికి వారి నిరంతర మార్గనిర్దేశం ప్రోత్సాహానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను. మంచి ప్లేస్మెంట్ సాధించడానికి సహకరించిన వరంగల్ నిట్ ప్లేస్మెంట్ సెల్‌కు కూడా నా కృతజ్ఞతలు. నా జీవిత లక్ష్యం ఎక్కువగా నేర్చుకోవడం, అనేక రంగాలను అన్వేషించడం, నా వ్యక్తిగత అభివృద్ధి ప్రయాణంలో ఏదీ మిగిలిపోనివ్వకపోవడం. నా కుటుంబం, వరంగల్ నిట్ ప్లేస్మెంట్ సెల్ ఇచ్చిన ప్రేరణ మద్దతుకు హృదయపూర్వక ధన్యవాదాలు.



